సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 17 । జూలై । 2023



టీబీ డ్యాంలో 9.5 టీఎంసీల నీరు

టీబీ డ్యాంలో ఆదివారం నాటికి 9.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 5,955, అవుట్‌ఫ్లో 195 క్యూసెక్కులుగా నమోదైంది.



టమాట కిలో రూ.100

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.100 పలికింది. కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.85 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.7°/ 21.5°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

గవర్నర్‌కు స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: బెంగుళూరు నుంచి ఆదివారం చిలమత్తూరు సమీపంలో ఉన్న రక్షా అకాడమీ చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎస్పీ మాధవరెడ్డి స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తప్పక విచ్చేయాలని ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలో సైతం 'స్పందన' ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

సబ్సిడీపై రైతులకు గడ్డి కత్తిరించే మిషన్లు



పుట్టపర్తి అర్బన్: పాడి రైతులకు ఉపయోగపడే గడ్డి కత్తిరించే చాప్‌కట్టర్లు 40 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శుభదాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాకు 150 చాప్‌కట్టర్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మిషన్ ధర రూ.33,971 కాగా, రైతులకు రూ. 13,588 సబ్సిడీ పోనూ, రూ.20,383 రైతులు డీడీ తీసి ఇవ్వాలన్నారు. వివరాలకు గ్రామీణ పశువైద్యశాలల్లో సంప్రదించాలని సూచించారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8 మండలాల్లో వర్షం



పెదపల్లి వద్ద వాన

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 8 మండలాల్లో ఆదివారం వర్షం పడింది. ఈ మేరకు జిల్లా వాతావరణశాఖ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. కదిరి మండలంలో 13 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కొత్తచెరువు 12 మి.మీ, గాండ్లపెంట 8.4, బుక్కపట్నం 7.6, రామగిరి 6.4, చెన్నేకొత్తపల్లి 4.4, నంబులపూలకుంట 4.2, పుట్టపర్తి 2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.

రేపటి నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

రాప్తాడు రూరల్: 'నాయకత్వ లక్షణాలు' అనే అంశంపై ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు రీజినల్ స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. అనంతపురం నగర శివారులోని టీటీడీసీ వేదికగా జరిగే ఈ శిక్షణకు అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 50 మంది చొప్పున మొత్తం 200 మంది ప్రధానోపాధ్యాయులు హాజరుకానున్నారు. ఆరు రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ విషయ నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.సాయిరామ్ తెలిపారు. తప్పక హాజరు కావాలని, ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.

చిరు వ్యాపారికి తోడు

- 18న 'జగనన్న తోడు'
- రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు
- జిల్లాలోని 11,372 మందికి ప్రయోజనం
- లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.11.37 కోట్లు



చైతన్య జ్యోతి మ్యూజియం వద్ద పండ్లు విక్రయిస్తున్న తోపుడుబండి వ్యాపారులు



సత్తెమ్మ ఆలయం వద్ద పూలు, పండ్లు, గాజులు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

పుట్టపర్తి అర్బన్: చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి అండగా నిలిచి వారి వ్యాపారాలకు ఆర్థిక సాయం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న తోడు' పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా నిరుపేద చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.10 వేల చొప్పున బ్యాంకుల ద్వారా రుణం అందిస్తున్నారు. నాలుగేళ్ల కాలంలోనే ఆరు విడతలుగా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలను అందించారు. ప్రస్తుతం ఏడో విడత అందజేయడానికి సిద్ధమవుతున్నారు.

అర్హులు ఎవరంటే...

గ్రామాలు/ పట్టణాల్లో 5 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పుతో శాశ్వత/తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు, ఫుట్‌పాత్‌లు, వీధుల్లో తోపుడు బండ్లు, గంపలు, బుట్టల్లో కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు అమ్ముకునేవారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించుకునేవారు అర్హులు. అలాగే సంప్రదాయ చేతివృత్తుల కళాకారులు, కళంకారీ, తోలుబొమ్మల తయారీ, కుమ్మరి తదితర వృత్తులపై ఆధారపడి జీవించేవారికీ 'జగనన్న తోడు' కింద సున్నా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందజేస్తోంది.

'వడ్డీ'కాటుకు బలికాకుండా..

గతంలో చిరువ్యాపారులంతా తమ వ్యాపార పెట్టుబడి కోసం రూ.3 నుంచి రూ.10 వరకు రోజువారీ వడ్డీకి ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పు తెచ్చుకునేవారు. తమ ఆదాయంలో అధిక మొత్తాన్ని వడ్డీ చెల్లింపులకే వెచ్చించేవారు. ఈ క్రమంలో ఒక్కోసారి కొంత మంది వడ్డీ వ్యాపారులు చిరువ్యాపారుల వాహనాలను జప్తు చేయడం, బంగారు నగలు కుదువ పెట్టుకోవడం, చెల్లింపులు సక్రమంగా లేక పోతే భౌతిక దాడులు, పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేయించేవారు. వీటన్నింటినీ తన పాదయాత్రలో కళ్లారా చూసి చలించిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే 'జగనన్న తోడు' పథకానికి రూపకల్పన చేశారు. చిరు వ్యాపారాలు సచివాలయంలో నమోదు చేసుకుంటే అర్హులను గుర్తించి ప్రతి ఆరు నెలలకు ఓ సారి రూ.10 వేల నగదు అందజేస్తున్నారు. ప్రస్తుతం కంతులు చెల్లించే సమయంలో వడ్డీతో చెల్లిస్తే రుణ మొత్తం కట్టగానే వడ్డీ మొత్తాన్ని తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

జిల్లాలో 11,372 మందికి లబ్ధి..

'జగనన్న తోడు' పథకానికి జిల్లాలో 11,372 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి రూ.10 వేల చొప్పున రూ.11.37 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే గతంలో రూ.10 వేల చొప్పున రుణాలు తీసుకుని కంతులు చెల్లించిన 19,487 మంది వ్యాపారులకు వడ్డీ మొత్తం రూ.43.20 లక్షలు మంజూరైంది. ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు మెగాచెక్కు అందజేయనున్నారు.

సంతోషంగా ఉంది



నేను 20 ఏళ్లుగా తోపుడుబండిపై చీనీకాయల వ్యాపారం చేస్తున్నా. మా గురించి ఇంతవరకూ ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు 'జగనన్న తోడు' పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి చిరు వ్యాపారికి రూ.10 వేల చొప్పున వడ్డీలేని రుణం అందిస్తున్నారు. నేను ఇప్పటి వరకూ 3 సార్లు తీసుకున్నా. ఈ పథకం మాలాంటి వారికి చాలా ఉపయోగం.

– హైదర్‌వలి, చిరువ్యాపారి, పుట్టపర్తి

కొత్తగా నమోదు చేసుకున్నా



నేను పుట్టపర్తిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పూలు, అరటి పండ్లు విక్రయిస్తున్నా. ఇటీవల వలంటీర్ ద్వారా 'జగనన్న తోడు' పథకానికి కొత్తగా నమోదు చేసుకున్నా. వడ్డీ లేని రుణాలతో చిరు వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుంది. గతంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీకి తీసుకొని చాలా ఇబ్బంది పడ్డాం. 'జగనన్న తోడు' వల్ల వడ్డీ బాధలు తప్పుతాయి.

– రత్నమ్మ, పెద్దబజారు, పుట్టపర్తి

18న ఖాతాల్లోకి నగదు



జిల్లాలో జగనన్న తోడు లబ్ధిదారుల గుర్తింపు పూర్తయ్యింది. 11,372 మందికి రూ.10 వేల చొప్పున రూ.11.37 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేస్తాం.

– నరసయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయిస్తే చర్యలు

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం టౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులతో పని చేయించినా, వారిని కార్యాలయంలోకి అనుమతించినా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుంటామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాతుకుపోయిన ప్రైవేట్ వ్యక్తులు చేసిన తప్పిదాలకు ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండైన తీరుపై 'కీలకమైనా కీలుబొమ్మలే!' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆమె స్పందించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పర్యవేక్షణ చేయాలని జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణంను ఆదేశించారు.

ప్రభుత్వ ప్రత్యేక బియ్యం కౌంటర్

- కంది బ్యాళ్లూ అమ్మకం



బియ్యం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బియ్యం కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం బియ్యం కౌంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం తక్కువ ధరకే బియ్యం విక్రయించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. సాధారణ రకం బియ్యం రూ.30, ఫైన్ రకం రూ.32, బీపీటీ– రూ.44, సోనామసూరి– రూ.44, కంది బ్యాళ్లు రూ.135తో విక్రయిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్‌తో జేసీ చేతన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారని ఆమె వెల్లడించారు.

ఆలయ ఆస్తులు భద్రం!

- దేవదాయశాఖ భూముల పరిరక్షణకు సర్కారు చర్యలు
- జిల్లాస్థాయిలోనే స్వాధీనానికి శ్రీకారం
- మాన్యాలకు వీడనున్న చెర

మండలాలు	32
దేవాలయాలు	1,104
మాన్యం	10,759 ఎకరాలు
ఆక్రమణలో ఉన్న భూమి	380 ఎకరాలు
కోర్టు కేసులు	5



దుద్దేబండ వద్ద ఉన్న ఆలయ భూమి

పుట్టపర్తి టౌన్: టీడీపీ హయాంలో దేవదాయ శాఖ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అధికారం అండతో పచ్చనేతలు మాన్యాలు దోచుకున్నారు. వందల ఎకరాలు తమ గుప్పిట్లో ఉంచుకున్నారు. కోర్టుల్లో ఆక్రమణదారులతో పోటీ పడలేక దేవదాయ శాఖ అధికారులు చాలా వరకూ ఆ భూములను వదిలేశారు. అలాంటి వారి ఆగడాలకు చెక్ పెట్టేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. భూముల స్వాధీనం ప్రక్రియ జిల్లా అధికారులకే దఖలు పరుస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.

త్వరలో 380 ఎకరాల స్వాధీనం..

దేవదాయ భూములు చేతులు మారుతూ అన్యాక్రాంతం అవుతున్నా గత ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. దేవాలయ భూమి సెంటు ఉన్నా తిరిగి ఆలయాలకే చెందేలా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాస్థాయిలోనే కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ముందుగా సమావేశం నిర్వహించి ఎక్కడెక్కడ భూములు ఆక్రమణలో ఉన్నాయో కమిటీలో చర్చిస్తారు. అనంతరం ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తారు. లొంగకపోతే సంబంధిత పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి విడిపించేందుకు ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సర్కారు నిర్ణయం వల్ల త్వరలో జిల్లా వ్యాప్తంగా ఆక్రమణలోని 380 ఎకరాల ఆలయ భూములు తిరిగి దేవదాయ శాఖ ఆధీనంలోకి రానున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపట్టలేదని అధికారులు చెబుతుండడం గమనార్హం.

కమిటీ ఇలా..

కమిటీ చైర్మన్‌గా జిల్లా ఎస్పీ వ్యవహరిస్తారు. జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, ఈఓ, జిల్లా రిజిస్ట్రార్, ఆర్‌అండ్‌బీ ఈఈ, సర్వే ఆఫ్ ల్యాండ్ ఏఈలు సభ్యులుగా ఉంటారు. కమిటీ సమావేశం నిర్వహించి, దేవదాయ భూముల వివరాలు తెలుసుకుంటారు. అనంతరం సంబంధిత దేవదాయ శాఖ అధికారుల ద్వారా ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటారు.

మాన్యాలకు రక్షణ



ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ఆలయ ఆస్తులకు రక్షణ కల్పించనుంది. గతంలో కొందరు చట్టాల్లోని లొసుగులు ఆసరా చేసుకుని కోర్టులకు వెళ్లి కోట్ల రూపాయలు విలువచేసే ఆస్తులు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. న్యాయస్థానాల్లో పోరాడలేక అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. ఆర్డినెన్స్ ద్వారా జిల్లా కమిటీలకే భూములు స్వాధీనం చేసుకునేలా నిబంధనలు ఉండడంతో ఆస్తులకు రక్షణ లభించనుంది. త్వరలో భూముల స్వాధీనానికి చర్యలు తీసుకుంటాం.

– మల్లిఖార్జున రెడ్డి, జిల్లా దేవదాయశాఖ అధికారి.

న్యాయవాద వృత్తిని ప్రోత్సహించడమే లక్ష్యం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

- ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల

పెనుకొండ: న్యాయవాద వృత్తిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలమూ న్యాయవాదులందరికీ తగిన సహకారం అందుతుందని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. వైఎస్సార్ లా నేస్తం కింద యువ న్యాయవాదులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకోవడంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు ఆదివారం పెనుకొండలోని నామా రామయ్య కల్యాణమంటపంలో కృతజ్ఞతాభివందనాల సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీతో పాటు మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షురాలు గోళ్ల మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వృత్తి పరంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్న న్యాయవాదులను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదుకుంటామంటూ ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత నెరవేర్చారంటూ గుర్తు చేశారు. యువ న్యాయవాదులకు నెలకు రూ.5వేల చొప్పున మూడేళ్ల పాటు ఆర్థిక సాయం, న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించడం చరిత్రాత్మకమన్నారు. న్యాయవాదులు చనిపోతే వారికి బార్ అసోసియేషన్ తరపున రూ. 4 లక్షలు, ప్రభుత్వం రూ. 4 లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. పలువురు యువ, సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో న్యాయవాద వృత్తిలో గౌరవంగా కొనసాగుతున్నామన్నారు. ఆత్మగౌరవం పెంపొందిందని, ఆయన సాయంతో నేడు సగర్వంగా కోర్టుకు వెళుతున్నామన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్ రెడ్డి, ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణయాదవ్, ఏపీపీలు నాగేశ్వరి, నాగరాజు, వి.శ్రీనివాసులు, ఉమాపతి, మోహన్‌నాయక్, విక్రాంత్‌నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయె

ముస్తాబైన ఎస్కేయూ



విద్యుద్దీపాలంకరణలో ఎస్కే యూనివర్సిటీ ముఖద్వారం


అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవం సోమవారం అట్టహాసంగా జరగనుంది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్/ యూనివర్సిటీ చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరవుతున్నారు. భారత మాజీ అంధ క్రికెటర్ మహంతేష్ జి.కె.కు గౌరవ డాక్టరేట్ అందించనున్నారు. 9,150 మందికి గాను నేరుగా 356 మందికి స్నాతకోత్సవంలో డిగ్రీలు ప్రదానం చేస్తారు. ఆదివారం స్నాతకోత్సవ రిహార్సల్స్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ప్రొఫెసర్, అసోసియేట్,అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ తప్పనిసరిగా ఫార్మల్ డ్రస్ ధరించాలని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. డాక్టరేట్ గ్రహీతలు తప్ప వారి బంధువులు ఎవరినీ స్నాతకోత్సవానికి అనుమతించమని స్పష్టం చేశారు. స్నాతకోత్సవ ఆహ్వాన పత్రిక ఉన్న వారికి మాత్రమే అనుమతిస్తారని తెలిపారు.

గవర్నర్ పర్యటన ఇలా..

- సోమవారం ఉదయం 9:15 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఎస్కేయూకు బయల్దేరుతారు.
- ఉదయం 9:30కు ఎస్కేయూకు చేరుకుని, 9.35 గంటలకు శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తారు.
- 9:40 గంటలకు అకడమిక్ బ్లాక్ ప్రారంభిస్తారు.
- ఉదయం 9:50 నుంచి 10 గంటలకు మెన్ హాస్టల్‌ను గవర్నర్ ప్రారంభిస్తారు.
- ఉదయం 10:10 గంటలకు క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారు.
- 10:10 నుంచి 10:30 గంటల వరకు రిజర్వ్.
- ఉదయం 10:30 నుంచి 12:15 గంటల వరకు ఎస్కేయూ స్నాతకోత్సవంలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 12:15 నుంచి 1:15 గంటల వరకు భోజన సమయం.
- మధ్యాహ్నం 1:15 గంటలకు అనంతపురానికి బయల్దేరుతారు.
- మధ్యాహ్నం 1:30 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2:55 గంట వరకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు.
- మధ్యాహ్నం 3 గంటలకు విజయనగర లా కళాశాలకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3 నుంచి 3:25 గంటల వరకు న్యూ అకడమిక్ బిల్డింగ్ నిర్మాణాన్ని ప్రారంభిస్తారు.
- సాయంత్రం 5:10 గంటలకు రక్ష అకాడమీ, చిలమత్తూరుకు చేరుకుంటారు.
- సాయంత్రం 7:10 గంటలకు బెంగళూర్‌లోని రంకా పార్క్ అపార్ట్‌మెంట్, లాల్‌బాగ్ రోడ్డుకు చేరుకుంటారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

- వైద్యవిధాన పరిషత్ జాయింట్ కమిషనర్ సరళమ్మ



చిన్నపిల్లల వార్డులో వైద్యులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ సరళమ్మ

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్ని విభాగాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ సరళమ్మ ఆదేశించారు. ఆదివారం స్థానిక జిల్లా ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌డీఎస్ నిధులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రేడియాలజిస్ట్ కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. త్వరలో ఆ పోస్టును భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఫిజీషియన్స్ అందుబాటులో ఉండి సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఆర్థో సేవలు మెరుగు పడేలా చూస్తామన్నారు. వైద్యులకు అవసరమైన పరికరాలు అందించేలా సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గైనిక్ వార్డుల్లో రెఫర్ కేసులు తగ్గి ప్రసవాలు పెరగాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ఆస్పత్రులను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిధులను, వైద్యులను, సిబ్బందిని కేటాయిస్తోందన్నారు. ఆస్పత్రిలో ఉండే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం


మృతుడు చిన్న రాజప్ప

పెనుకొండ/పావగడ: స్థానిక 44వ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో పావగడ తాలూకా నీలం పంచాయితీ మీనకుంటపల్లికి చెందిన చిన్న రాజప్ప (50) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మరమ్మతు చేయించేందుకు ట్రాక్టర్ మడకలను తీసుకుని లగేజి ఆటోలో స్వగ్రామం నుంచి బి.కొత్తకోటకు వెళుతుండగా పెనుకొండ శివారులోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. ఘటనలో ఆటో బోల్తాపడడంతో చిన్న రాజప్పపై మడకలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ షఫీవుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు చిన్నరాజప్పకు తల్లిదండ్రులు నరసింహప్ప, చెన్నమ్మ, భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై పెనుకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం తనిఖీలు చేపట్టగా ముగ్గురు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.2.50 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సర్వాంగ సుందరంగా పోలీస్ స్టేషన్


అందంగా ముస్తాబవుతున్న పోలీస్ స్టేషన్

బత్తలపల్లి: పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు, పోలీసులకు అందుతున్న మౌళిక వసతులు, సేవలను, పరిసరాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెంట్రల్ టీం సోమవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేయనుంది. జిల్లాలో 17న బత్తలపల్లి, 18న ముదిగుబ్బ, 19న రామగిరి, 20న అగళి పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసి, ర్యాంక్‌లు కేటాయించనున్నారు. అనంతపురం జిల్లాలో 19వ తేదీన గార్లదిన్నె, 20న ఆత్మకూరు, 21న కసాపురం, 22న బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేయనున్నారు. దీంతో బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అన్ని గదులను అందంగా ముస్తాబు చేశారు. రంగులు వేయించారు. స్టేషన్ చుట్టూ సిమెంట్ రోడ్డు వేయించారు. నూతనంగా స్టేషన్ బోర్డు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఆరోహణరావు, ఎస్ఐ టీవీ శ్రీహర్ష, సిబ్బంది పనులు చేయిస్తున్నారు. వీటిని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.

హ్యాపీ జర్నీ


కొత్తచెరువు - పుట్టపర్తి మార్గంలో నీడను పంచుతున్న చెట్లు


రోడ్డుకు ఇరువైపులా కనువిందు చేస్తున్న పూల చెట్లు

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి చుట్టుపక్కల పరిసరాల్లో భారీ వృక్షాలు దర్శనమిస్తున్నాయి. పట్టణం నుంచి ఎటు వైపు ఏ మార్గంలో వెళ్లినా పచ్చదనం కనిపిస్తోంది. చల్లటి వాతావరణం ఆహ్లాదం నింపుతోంది. పుట్టపర్తికి ప్రజల రాకపోకలు పెరిగాయి. రహదారి చుట్టూ పచ్చదనం పరచుకుని ఉండడాన్ని ప్రయాణికులు ఆస్వాదిస్తున్నారు. కొత్తచెరువు వద్దనైతే కొండల మధ్య మేఘాల దోబూచులాటలు ఆకట్టుకుంటున్నాయి. అటుగా వెళుతున్న వాహనదారులు ఈ దృశ్యాలను చూస్తూ ఆనందంగా ముందుకు సాగిపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


సత్యసాయి మహాసమాధి దర్శనానికి వాహనాల్లో వస్తున్న భక్తులు


జిల్లా పోలీసు కార్యాలయం

సిమెంట్ గోల్‌మాల్‌లో నాకు సంబంధం లేదు

- మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి
- నిరాధార ఆరోపణలు సబబు కాదు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: గ్రామ సచివాలయాల నిర్మాణాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్ పక్కదారి పట్టించడంతో తనకు ఏ మాత్రం సంబంధం లేదని, ఈ అంశంపై నిరాధార ఆరోపణలు చేయడం సబబు కాదని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. ఆదివారం చందకచెర్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటాయించిన పనులకు సిమెంట్‌ను వినియోగించుకోకుండా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకున్న ఇంజినీర్ల తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. దీనిపై సమగ్ర విచారణ అనంతరం బాధ్యులైన డీఈతో పాటు నలుగురు ఇంజినీర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. మడకశిర ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న తనపై ఉద్దేశ పూర్వకంగా రొళ్ల ఎంపీపీ కవిత భర్త విజయరంగేగౌడు అసత్య ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. వాస్తవానికి రెండేళ్ల పాటు ఎంపీపీగా కవిత ఉంటారని తర్వాత మరొకరికి అవకాశం కల్పించేలా గతంలో ఎంపీటీసీల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎంపీపీ పదవి పోతుందన్న అక్కసుతో తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. విత్తన మినీకిట్లను పేద రైతులకు ఇవ్వాలని తాను స్పష్టంగా ఆర్బీకే సిబ్బందిని ఆదేశించానన్నారు. దీనిని జీర్ణించులేక విజయరంగేగౌడు వ్యవసాయ కార్యాలయానికి తాళం వేశాడన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారి తీరును అధిష్టానం దృష్టికి తీసుకెళ్లబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ ప్రభావతిబాయి, మండల బీసీ, ఎస్సీ సెల్ నాయకులు సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

అమరాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అమరాపురం మండలం తమ్మడేపల్లి గ్రామానికి చెందిన హనుమంతరాయ, లత(36) దంపతులు. నెలసరి సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో ఆమె బాధపడేది. చికిత్స చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఇంట్లో చిన్నపాటి అంశాలకు సైతం తీవ్రంగా స్పందిస్తూ వచ్చేది. తన మాటే నెగ్గాలని మొండిగా వ్యవహరిస్తూ తరచూ భర్తతో గొడవపడేది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై భర్త అనంతపురానికి వెళ్లిన సమయంలో ఇద్దరు చిన్నారులను ఆడుకునేందుకు బయటకు పంపిన లత... ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న చిన్నారులు విగత జీవిగా వేలాడుతున్న తల్లిని గమనించి, విషయాన్ని చుట్టుపక్కల వారికి తెలపడంతో, వారి నుంచి సమాచారం అందుకున్న భర్త, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి బలవన్మరణం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రహమత్ నగర్‌కు చెందిన చాకలి ఆదినారాయణ, గంగమ్మ దంపతులకు కుమారుడు మురళి (18), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన మురళి.. డిగ్రీ కళాశాలలో చేరాల్సి ఉంది. ఈ క్రమంలో చదువును నిర్లక్ష్యం చేస్తూ ఓ యువతితో నడుపుతున్న ప్రేమ వ్యవహారం బయటపడడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మురళి శనివారం రాత్రి మేడపై పడుకుంటానంటూ వెళ్లి మేడపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కన్నీళ్లకు కరిగి.. బదిలీని ఆపేసి!


ఉపాధ్యాయులను చుట్టుముట్టి రోదిస్తున్న విద్యార్థులు (ఫైల్)

పావగడ: తమకిష్టమైన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో విద్యార్థుల వేదనకు అంతులేకుండా పోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ గ్రామానికి ఎంతో మేలు చేస్తున్న ఆ ఉపాధ్యాయులను అక్కడే కొనసాగించాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు దిగొచ్చి ఉపాధ్యాయుల బదిలీని రద్దు చేసింది. అరుదైన ఈ ఘటన పావగడ తాలూకా చిక్కనాయకనహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొన్నేళ్లుగా ఉపాధ్యాయులుగా మమత, మంజునాథ్ పనిచేస్తున్నారు. ఉత్తమ విద్యాబోధనతో పిల్లల్లో నైపుణ్యాలు వెలికి తీస్తూ అందరి మన్ననలు పొందారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా ఆ ఉపాధ్యాయులిద్దరూ మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. శనివారం తమ విధులకు హాజరైన ఉపాధ్యాయులు తాము బదిలీ అయిన విషయాన్ని తెలపడంతో విద్యార్థులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. మీరెక్కడికీ వెళ్లకండి అంటూ ఉపాధ్యాయులను చుట్టుముట్టి రోదించసాగారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మూకుమ్మడిగా స్థానిక బీఈఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో ఉపాధ్యాయుల బదిలీలను రద్దు చేసి యథావిధిగా అదే పాఠశాలలో కొనసాగేలా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్య సేవల్లో రాజీ పడొద్దు

- ఐఎంఏ రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్‌లో వక్తలు
- వైద్యులకు అండగా నిలిచింది డాక్టర్ వైఎస్సారే
- 2008లో వైద్యుల రక్షణ చట్టం తెచ్చారు
- రక్షణ చట్టాన్ని మరింత పటిష్టం చేయాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి

అనంతపురం క్రైం: నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో రాజీ పడకూడదని వైద్యులకు ఏపీ వైద్య మండలి చైర్మన్, ఆరోగ్యశ్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి అన్నారు. అనంత ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియం వేదికగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రీజినల్ అకడమిక్ జోన్ 3 కాన్ఫరెన్స్ సమావేశం ఆదివారం జరిగింది. డాక్టర్ సాంబశివారెడ్డితో పాటు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి, ఏపీ రాష్ట్ర వైద్య మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, సమావేశ పరిశీలకులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన వైద్యాన్ని అందించాలని, వైద్యుల హక్కులను పరిరక్షించడంలో ఐఎంఏ కీలక పాత్ర పోషించాలని సూచించారు. కోవిడ్ విపత్కర సమయంలో ఐఎంఏ ఆధ్వర్యంలో అందించిన టెలీ మెడిసిన్ సేవలను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ ఐదేళ్లలో 30 క్రెడిట్ మార్కులు సాధించాలన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్‌తో పాటు ఐఎంఏ సభ్యత్వం ఒకేసారి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్యుల హక్కుల పరిరక్షణ వైఎస్సార్‌తోనే

వైద్యులు, ఆస్పత్రులపై దాడుల నిరోధానికి దేశంలో మొట్టమొదటి సారిగా 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి, వైద్యులకు అండగా నిలిచారని వక్తలు గుర్తు చేశారు. ప్రస్తుతమున్న ఏపీ వైద్య రక్షణ చట్టంలో సవరణ చేసి వైద్యులు, ఆస్పత్రులపై దాడులకు పాల్పడిన వారిపై ఏడేళ్ల జైలు శిక్ష పడేలా నూతన చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆస్పత్రుల్లో రోగులు మరణించిన సందర్భాల్లో చికిత్సలో లోపాల కారణంగా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని, అయితే సుప్రీం కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ విచారణ నివేదిక ఆధారంగా మాత్రమే కేసులు నమోదు చేయాలన్నారు. ఆ దిశగా ఐఎంఏ చొరవ తీసుకోవాలని సూచించారు.

సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు:

ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో మంజూరు చేస్తూ నిరుపేదల వైద్యానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వక్తలు ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని రకాల జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చడం, కోలుకునే సమయంలో ఆర్థిక సాయం అందజేయడం ద్వారా రాష్ట్రంలోని పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు అత్యున్నత వైద్య చికిత్సలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, డాక్టర్ మనోరంజన్ రెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్, అనంతపురం ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ కొండయ్య, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ హేమలత అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు నుంచి 480 మంది వైద్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

- సీఆర్పీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్


గోవర్ధన్‌కు బొకే అందజేస్తున్న సీఆర్పీలు

రాప్తాడు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్పీలను సీఆర్ఎంటీలుగా గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఏపీ సీఆర్పీల సంక్షేమ సంఘం (ఏపీసీఆర్పీడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. అనంతపురం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా సీఆర్పీల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది.ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇటీవలే సీఆర్పీలను సీఆర్ఎంటీలుగా పేరు మార్పు చేస్తూ జీఓ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బీఎడ్ చేసి టెట్ అర్హత సాధించిన సీఆర్పీలను బోధనకు వినియోగించుకోవాలని సీఎం జగనన్న చెప్పడం చాలా సంతోషకరమన్నారు. సీఆర్ఎంటీలకు భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయన్నారు. అనంత జిల్లా అధ్యక్షుడు అంజనరాజు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ఆగస్టు 12న గుంటూరులో జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఆర్పీ అసోసియేషన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగభూషణ, నరసింహమూర్తి, వెంకటనాయుడు, సంధ్యారాణి, పుణ్యవతి, జలజాక్షి, బ్రహ్మయ్య, రామాంజనేయులు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'నిప్పీ' పేరుతో టోపీ

- ప్రముఖ వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘనుడు


పసుపులేటి అంకుశం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నిప్పీ డెలివరీ సర్వీసు పేరుతో తమను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ కె.శ్రీనివాసరావును నగరంలోని ప్రముఖ వ్యాపారులు ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఆయన కేసును బుక్కరాయసముద్రం పోలీసులకు బదిలీ చేశారు. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడప మండలం రుకవారిపల్లికి చెందిన పి.అంకుశం 24 రోజుల క్రితం బీకేఎస్ పరిధిలోని పసుపులేటి మాతా గోదాములో నిప్పీ డెలివరీ సర్వీసు పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించాడు. నగరంలోని ప్రముఖ వ్యాపారులను పిలిపించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపించాడు. తన వ్యాపారం గురించి వివరించాడు. తనతో కలసి వ్యాపారం చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు ఆదాయం పెరుగుతుందని నమ్మబలికాడు. సరుకును విక్రయించిన అనంతరం తన కమీషన్ పట్టుకుని మిగులు మొత్తాన్ని అందజేస్తానని అంకుశం తెలపడంతో అందరూ ఒప్పుకున్నారు. అతని మాయలో చిక్కుకున్న పలువురు వ్యాపారులు తమ వద్ద సరుకులను అప్పగించారు. వీటితో గోదాము పూర్తిగా నిండిపోయింది. అది చూసిన వ్యాపారులు వ్యాపారం బాగా చేస్తున్నాడని మురిసిపోయారు. అయితే రాత్రికి రాత్రే లారీల కొద్ది సరుకును తీసుకుని అంకుశం మాయమయ్యాడు. దీంతో మోసపోయిన వ్యాపారులు ముందుగా అతని గురించి ఆరా తీశారు. అనంతలోనే రూ.70 లక్షలకు పైగా సరుకుతో ఉడాయించిన అంకుశం అక్రమాలకు నెల్లూరు జిల్లాలో రూ.3 కోట్లు, కర్నూలు జిల్లాలో రూ.కోటికి పైగా వ్యాపారులు మోసపోయినట్లుగా గుర్తించారు. ఈ క్రమంలోనే అంకుశం జాడ తెలుసుకుని అతని ఇంటికి వెళితే కుటుంబసభ్యులు ఎదురు దాడికి దిగడంతో చేసేది లేక అనంతపురం తిరిగి వచ్చి ఎస్పీ కె. శ్రీనివాసరావును కలసి జరిగిన మోసాన్ని వివరించారు. వ్యాపారుల ఆవేదనపై స్పందించిన ఎస్పీ కేసును బుక్కరాయసముద్రం పోలీసులకు బదిలీ చేశారు. మోసగాడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

మున్సిపల్ ఏసీపీ ఆనంద్‌కుమార్ ఆకస్మిక మృతి



హిందూపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ మృతి చెందారు. సెలవుపై స్వస్థలమైన నెల్లూరుకు వెళ్లిన ఆయన శుక్రవారం గుండెనొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందారు. అందరితో సఖ్యతగా ఉంటూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఆయన మృతిపై స్థానిక ఉద్యోగులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అకింతభావంతో పనిచేసే అధికారిని కోల్పోవడం దురదృష్టకరమని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది అన్నారు.

పరవశించిన ప్రశాంతి నిలయం


సంగీత కచేరి నిర్వహిస్తున్న గాయత్రి నారాయణన్



సేవాంజలి నాటికలో ఘట్టాలు

ప్రశాంతి నిలయం: విజయనగరం జిల్లా సాయి భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తకోటిని పరవశింపజేశారు. ఆదివారం ప్రశాంతి నిలయంలో సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ గాయత్రి నారాయణన్ నిర్వహించిన సంగీత కచేరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సాయి కుల్వంత్ సభా మందిరం మార్మోగింది. సాయంత్రం విజయనగరం జిల్లా బాలవికాస్ విద్యార్థులు, సాయియూత్ 'సేవాంజలి' పేరుతో చక్కటి నాటిక నిర్వహించారు. ఏసుక్రీస్తు, గౌతమ బుద్ధుడు, షిరిడీసాయి, అల్లాను కొనియాడారు. సత్యసాయి చూపిన సేవా మార్గంతో లోక కల్యాణం సాధ్యమవుతుందన్న సందేశంతో ముగించారు. పిదప భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, రత్నాకర్ రాజు సతీమణి హిమవాహిని రత్నాకర్ నూతన వస్త్రాలను, జ్ఞాపికలను అందజేశారు.